# నైజం

అడుసుమిల్లి మల్లికార్జున

కైలాసంలో ఢమరుక ధ్వని లాగా వంటింట్లో గిన్నెల రణగొణధ్వని వినిపిస్తోంది. ఆ శబ్దం తుఫాను వచ్చేముందు రేడియో సంకేతం లాంటిది. రేడియోలో చెప్పినప్పుడు తుఫాన్ రాకపోవచ్చుగాని, వంట గదిలో ఆ సంకేతం వచ్చిందంటే యింట్లో తుఫాన్ వచ్చితీరాల్సిందే.

'ఏమి జరిగివుంటుందబ్బా' అని ఆలోచిస్తూ హాల్లో అడుగుపెట్టాను.

పాత్రల శబ్దంతో పాటు కాంతం సణుగుడు కూడా పోటీపడుతోంది.

నన్ను చూడగానే అది కాస్త తారాస్థాయికి చేరుకుంది.

విసురుగా కాఫీ పట్టుకొచ్చి టేబుల్‌మీద పడవేసినట్టుగా పెట్టి ఏదో అంది కాంతం. అర్థంకాలేదు.

"ఏమిటే. ఏం జరిగింది?" అన్నాను కాఫీగ్లాసు అందుకుంటూ.

"విపరీత బుద్ధులు. విపరీతకాలం."

"ఎవరివి. నీవా?" అన్నాను నవ్వుతూ.

"అలాంటి బుద్ధులు మా యింటా వంటా లేవు. వుంటే మీ తండ్రీ కొడుకుల దగ్గరే వుండాలి."

పరిస్థితి రవంత అర్థమైంది.

కొశ్చన్‌మార్కు మొఖంపెట్టి అమాయకంగా నా భార్య ముఖంలోకి చూశాను.

అదే నాకు తెలిసిన చిట్కా. ఇన్నేళ్ళ సంసార జీవితంలో నేను అట్లా ముఖంపెట్టి తప్పించుకున్న సంఘటనలు చాలా వున్నాయి.

మరింక నోటితో మాట్లాడలేదు కాంతం. చరచరా వెళ్ళి వుత్తరం పట్టుకొచ్చి నా వొడిలో పడేసి "చూడండి" అంది.

ప్రియమైన అమ్మకు,

నమస్కారములతో గోపి!

ఎంతో కాలంగా అనుకుంటున్నా డబ్బులు చాలక మీ కోడలికి వుంగరం చేయించలేదు. ఈ నెలతో ఆ కోరిక తీరింది. తెల్ల ముత్యంతో చిన్న వుంగరం చేయించాను. లలిత వ్రేలికి ఆ వుంగరం ఎంత ముచ్చటగావుందో! అందువలన ఈ నెల డబ్బులు పంపించటంలేదు.

మీకు మరీ అవసరం అనిపిస్తే కబురుచేయండి. ఎట్లాగో పంపిస్తాను.

నాన్నగారికి నమస్కారములు.

ఇంతే సంగతులు.

ప్రేమతో....

'గోపి'

ఉత్తరం చూశాక విషయం పూర్తిగా అర్థమైపోయింది. గోపి యిన్నాళ్ళకు ఆ మంచిపని కాస్తా చేసినందుకు మనసులో సంతోషం కలిగిందికూడా. పచ్చగా కుందనపు బొమ్మలా వుండే కోడలుపిల్ల ముచ్చటగా వుంగరం పెట్టుకుని, తళతళలాడే ముఖంతో చేతులు జోడించి 'నమస్కారం! మామయ్యగారు' అంటున్నట్టు కళ్ళముందు కదలాడింది.

అసలు పెళ్ళిలోనే లలితకు వుంగరం పెట్టవలసింది. అట్లాగే అనుకున్నాం కూడా. కాని కాంతం తెలివితేటలవల్ల, వియ్యంకుడి మంచితనంవల్ల – ఆ కార్యక్రమం కాస్తా రద్దు ఐపోయింది. తన తెలివితేటలకు కాంతం ఈనాటికీ మురిసిపోవటం నాకు తెలుసు. అమాయకంగా వుండే కోడలుపిల్లను చూచినప్పుడల్లా నా మనసు ఆర్ద్రమైపోయేది.

కట్నం డబ్బులు దండిగా గుంజాం. కనీసం చిన్న వుంగరమైనా పెట్టలేకపోయాం. ఉద్యోగరీత్యా వాళ్ళు కాస్తా మమ్మల్ని విడిచిపోతున్నప్పుడు మావాణ్ణి ప్రక్కకి పిలిచి చెవిలో చెప్పాను. "నువ్వైనా లలితకు వుంగరం చేయించరా."

అట్లాగే అన్నట్టు చిరునవ్వుతో వెళ్ళిపోయేడు.

ఇన్నాళ్ళకు ఆ కోరిక తీరిందన్నమాట.

ముఖంలో ఎలాంటి భావము కన్పించకుండా జాగ్రత్తపడి – భారంగా వూపిరిపీల్చి 'వూఁ' అన్నాను.

"నిన్నగాక మొన్న వచ్చిన పెళ్ళాం బెల్లమైంది. కన్నవాళ్ళం అల్లమైపోయాం. పెద్దలు వూరకే అన్నారా?"

"పోన్లేవే. నా పెన్షన్ ఎట్లాగూవుంది. పొలం నుంచి గింజలు వస్తున్నాయి. ఈ ఒక్కనెల వాడు పంపకపోతే నష్టమేమిటి?" అన్నాను.

"ఇవాళ వుంగరం అంటుంది. రేపు నెక్లెస్ అంటుంది. దానికంటే సరే. వీడికైనా జ్ఞానం వుండక్కర్లేదూ?"

"లలిత అట్లాంటి పిల్లకాదు. వుంగరం కూడా ఆ పిల్ల అడిగివుంటుందంటే నాకు నమ్మకంలేదు.".

"మీరు ఏది నమ్మేరు గనుక. హవ్వఁ బంగారం మండిపోతున్న ఈ రోజుల్లో ఇప్పుడు అంత అవసరం ఏమి వచ్చి పడింది. మేమూ ఇట్లాగే చేసి వుంటే సంసారాలు ఇంత దూరం వస్తాయా?"

అది మాత్రం నిజం. ఈనాటి వరకు నగ నట్రా చేయించమని కాంతం నన్ను అడిగిన పాపాన పోలేదు. అడగటానికి ఆస్కారం కూడ లేని స్థితి అనుకోండి. పెళ్ళయిన ఏడాదికల్లా తల్లి కావటం, ఆ తర్వాత పిల్లల జంజాటం. అదీగాక పుట్టింటి నుంచి తెచ్చుకున్నవి దండిగానే వున్నాయాయె. నేనూ ఏనాడు చేయిస్తానని అనలేదు. తనూ అడగలేదు. ఈ విషయంలో మాత్రం కాంతం అందరి ఆడవాళ్ళలాంటిది కాదని ఢంకా భజాయించి చెప్పవచ్చు.

శాంతంగా కాంతం ముఖంలోకి చూస్తూ –

"అసలు పెళ్ళిలోనే జరుగవలసింది. ఈనాటికి ఇట్లా తీరింది. నువ్వు తిడుతూ వుత్తరం వ్రాయకు. వాడు బాధపడతాడు." అన్నాను.

ఆ మాటతో కాంతం ముఖం బాగా ఎర్రబడింది.

"వాడు బాధపడతాడు. మీరు మంచి వాళ్ళు. ఎంత చెడ్డానేనే కదా! ఆడాళ్ళ సంగతి మీకేం తెలుసండి. ఆడదాన్ని, నాకు తెలుసు. తెచ్చే మగడుంటే హిమలయాన్ని కూడ తెమ్మంటారు. 'అయ్యో! ఎట్లా తెస్తాడు!' అని ఆలోచించరు. ముందు వెనక చూసుకోక పోతే, రేపు బాధపడేది వాళ్ళే కదా!"

చాల కాలం తర్వాత చక్కటి జీవిత సత్యం చెప్పింది. నిజమే! చాల మంది భార్యలకు భర్త సంపాదన ఎంత? ఎట్లా తెస్తున్నాడు? అన్న ఆలోచన వుండదు. తీసుక వస్తుంటే పుచ్చుకోవటమే. తీసుకరాని నాడు అలిగి మూతి బిగించటం. దాని పర్యవసానం ఎంతో భయంకరంగా వుంటుంది.

కాని నా బిడ్డ గురించి, కోడలు పిల్ల గురించి నాకు తెలీదూ?

గోపికి తగ్గ ఇల్లాలు లలిత. వాళ్ళ విషయంలో భయం లేదు.

ఆ మాట కాంతంతో అంటే మరెంత రాద్ధాంతం జరుగుతుందో!

"మాధవయ్యగారూ" అని బైట నుంచి కేకవేస్తున్న పరంధామయ్యగారు గజేంద్రున్ని రక్షించిన విష్ణుమూర్తిలా కనిపించాడు ఆ క్షణాన. బైటపడి పరంధామయ్యగారితో సమస్త 'విశ్వం' గురించి మాట్లాడుతూ వుండిపోయాను. ఆయన్ని ఎప్పుడూ విసుక్కుంటూ వుంటానుగాని, ఈ రోజు కాంతం నుంచి రక్షించినందుకు ఆయన యెడల చాల గౌరవ భావం కలిగింది. ఎప్పుడో, ఏదో సహాయం కూడ చేయాలనిపించింది.

నా మాటలు వింటూ పరంధామయ్యగారు ఆశ్చర్యపోతున్నారు. ఎప్పుడెప్పుడు వెళ్ళిపోదామా!

అని ముళ్ళ మీద కూచున్నట్లు కూర్చునే నేను- ఇవాళ, ఇట్లా- సూర్యుడు గృహోన్ముఖుడైపోయినా వదలక వుండటం ఆశ్చర్యంగాక మరేమిటి?

పక్షులు గూళ్ళకు చేరుకుంటున్నాయి.

జీవితం, రాజకీయం, సాహిత్యం... ఇట్లా నోటికి వచ్చిన విషయాలన్ని ఏకరువు పెట్టేస్తున్నాను.

పరంధామయ్యగారు రవంత కదిలి, 'ఇహ వెళ్దామా' అన్నాడు చివరకు.

ఏమాత్రం ఇష్టం లేకపోయినా తప్పుతుందా?

అయిష్టంగానే పైకి లేచాను.

ఇంటికి వెళ్ళేసరికి కాంతం టి.వి. ముందు కూర్చొని 'భరత నాట్యం' చూస్తూ వుంది. ఇంత వయసు వచ్చినా భరత నాట్యమంటే తనకు చచ్చే ఇష్టం. మనసుకు రవంత సుఖం కలిగి ప్రక్కనే కూచున్నాను.

భోజన కార్యక్రమం ఐపోయింది.

సన్నజాజి పందిరి ప్రక్కగా కుర్చీ వాల్చుకుని, ఆకాశంలోని నిండు చంద్రున్ని ఇష్టంగా చూస్తున్నాను.

కాసేపటికి కాంతం వచ్చింది.

రాగానే మొదలు పెట్టింది- సాయంత్రం వొదలిన యుద్ధం.

ఎదురు చెప్పటం మానుకున్నాను.

నిజమే!! బంగారం ధర మండిపోతుంది కదా! హితం ఏమిటంటే- మా చిన్నతనంలో సవర బంగారం (8 గ్రా.) వంద రూపాయలు. ఆ రోజుల్లో బంగారం కొనాలంటే భయపడే వాళ్ళు. ఇవాళ సవర రెండు వేల ఐదు వందలు. ఐనా ఎడా పెడా కొనేస్తున్నారు. ఏమనాలి?

నా మౌనాన్ని మరో విధంగా అర్థం చేసుకున్న కాంతం మరింతగా విజృంభించింది.

నా బాధ చూడలేక చంద్రుడు నవ్వుతో మబ్బుల చాటుకి తప్పుకున్నాడు.

★ ★ ★ ★

పండుగ మూడు రోజులు వుందనగా సుమతి అల్లుడితో కలిసి వచ్చింది.

ఇల్లంతా సందడి.

ఈసారి సుమతి రవంత వొళ్ళు చేసింది. ఆనందంగా, ఆరోగ్యంగా కనిపించింది.

"అల్లుడిగారికి ప్రమోషన్ ఏమైనా వొచ్చిందామ్మా" అన్నాను నవ్వుతో.

"పోండి నాన్నగారూ" ఇంట్లోకి పరిగెత్తింది సుమతి.

అల్లుడు రాకతో కాంతం మరీ బిజీ యాక్టరై పోయింది. పిండి వంటలు, విందు భోజనాలు, పాపం క్షణం తీరిక లేదు.

అల్లుడితో పిచ్చాపాటి మాట్లాడి, బజారు వెంట పడ్డాను.

రిటైర్డ్ మిత్రులతో కలిసి బాతాఖానీ చేస్తూ కూచున్నాను. రవంతసేపటికి పరంధామయ్యగారు అలసిన ముఖంతో వచ్చారు.

ఎప్పుడూ గల గల మాట్లాడే మనిషి అట్లా వుండేసరికి ఆశ్చర్యం కలిగి పలకరించాను.

"ఏమిటి? అట్లా వున్నారు?"

"ఏం లేదండి"

"ఫర్లేదు. చెప్పండి"

"పండక్కి అల్లుడుగారు వస్తున్నారు. చేతిలో పైసా లేదు. ఏమిటో ఈ ఫార్మాలిటీస్, ఇంత వయసు వచ్చినా మానుకోలేకపోతున్నాం" నవ్వేడు.

ఆ నవ్వులో మిళితమైన విషాదం నా గుండెను కలిచి వేసింది.

"ఎంత కావాలి" చాల సౌమ్యంగా అడిగాను.

వూహించని ప్రశ్నకు వులిక్కిపడ్డాడు.



## విజ్ఞానం-వినోదం

బాబ్ బ్రౌన్



**సమస్య**

మంచు ముక్క

**అవసరం**

నీటిపై మంచు ముక్క

**ఈ విధంగా చేయండి**

నీటిపై తేలుతున్న మంచు ముక్కను గమనించండి. ఇది గబుక్కున తిరగబడుతుంది.

**ఇలా ఎందుకని?**

ఇది కేవలం సైన్సు చేసే ఒక చిన్న తమాషా! చూడటానికి వింతగా ఉంటుంది. వెచ్చని నీరు తగులుతున్న అడుగు భాగాన మంచు ఎక్కువ కరుగుతుంది. దాంతో పై భాగాన బరువు ఎక్కువ అవడమే మంచు ముక్క తిరగబడటానికి కారణం.

### నైజం

"కనీసం ఐదు వందలైనా కావాలి"

"మీరు దిగులు పెట్టుకోకండి. రెండు రోజుల్లో నేను సర్దుతాను. తర్వాత మీ దగ్గర వున్నప్పుడు ఇవ్వండి"

సజల నయనాలతో నా రెండు చేతులు పట్టుకున్నాడు.

"మనం ఎంత కాలం బ్రతుకుతాం. పిల్లల సంతోషమే కదా మనకు తృప్తి" అన్నాను.

పరంధామయ్యగారి కళ్ళలో కాంతి చూశాక ఏదో తెలీని ఆనందం కలిగింది.

కాంతాన్ని అడిగి పరంధామయ్యగారికి డబ్బు అందించే మార్గం ఆలోచిస్తూ ఇంటి దారి పట్టేను.

మాటైతే ఇచ్చేనుగాని ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అంతా కాంతానిదే. ఏం చెయ్యాలో తెలీక బుర్ర బద్దలు చేసుకుంటుంటే– చిరు నవ్వులు చిందిస్తూ కాంతం వచ్చింది.

"ఎవడు ఏడవమన్నాడు. ఆ మాత్రం అల్లుడికి పెట్టలేని వాడు పండక్కి రావద్దని చెప్పవచ్చు కదా. మళ్ళీ ప్రిస్టేజి. బోడి ప్రిస్టేజి."

"ఎవర్నండీ తిడుతున్నారు."

"ఇంకెవరు? ఆ పరంధామయ్యగారు. ఐదు వందలు కావాలట. లేకుంటే ఆత్మహత్య చేసుకుంటాడట".

"ఏం పాపం".

"అల్లుడికి బట్టలు పెట్టాలిట"

"మరి పండక్కి ఆ మాత్రం లేకుంటే ఎట్లాగండి."

"ఇతని దగ్గర వుండాలి కదా".

"లేకుంటే అప్పు చేయాలి. అల్లుడన్నాక తప్పుతుందా?"

"అదే కదా! అప్పు అంటూ నా ప్రాణం తీస్తున్నాడు."

"పోనీ ఇవ్వకపోయారా".

"మనం ఏమన్నా కోటీశ్వర్లమా!"

"పండుగపూట పెద్దాయన బాధ పడుతుంటే ఏం బావుంటుంది. నేనిస్తాను, ఇచ్చి రండి. పైనెల పెన్షన్ తీసుకోగానే ఇవ్వాలని చెప్పండి"

ప్లాన్ ఇంత త్వరగా ఫలిస్తుందని వూహించలేదు.

ఆనందం ఏ మాత్రం బైటకు కన్పించకుండా, జాగ్రత్తపడ్డాను.

ఎట్లాగైనా ఆడ గుండె కదా! జాలిగుండె.

"అన్నట్టు చప్పున రండి. మీకో శుభవార్త చెప్పాలి."

"ఈ వయసులో ఏం శుభవార్త" అన్నాను చిలిపిగా.

"వేషాలకేం తక్కువ లేదు." అంటూ ఇంట్లోకెళ్ళి ఐదు వందలు తీసుక వచ్చి చేతిలో పెట్టింది.

"మళ్ళీ ఇప్పుడు ఎవరు వెళ్తారు. రేపు ఇవ్వచ్చులే"

"పాపం వెళ్ళి రండి. ఆ పెద్ద మనిషి అన్నంత పని చేసుకుంటారేమో".

"సరే" అని బయల్దేరాను.

తిరిగి వచ్చేసరికి కాంతం వాకిట్లోనే ప్రత్యక్షమైంది. ఆ వార్త ఏదో నా చెవిని పడేస్తే కాని నిద్ర పట్టేట్టు లేదు.

"వున్నారా?"

"ఆహా లక్షణంగా పుచ్చుకున్నారు."

"కూచోండి ఒక్క క్షణంలో వస్తాను." అని పరుగులాంటి నడకతో ఇంట్లోకెళ్ళింది.

అతిశలు, జంతికలు పట్టుకొచ్చింది.

శుభ్రంగా తింటూ కాంతం చెప్పబోయే విషయం గురించి ఆలోచిస్తున్నాను.

"అల్లుడుగారు చాల మంచివారండి" అంది.

"ఏ అల్లుడుగారు."

"మన అల్లుడుగారే".

ఆ విషయం కాంతం క్రొత్తగా చెప్పవలసిన అవసరం లేదు. సుమతి పెళ్ళికి పడ్డ తిప్పలన్ని అల్లుడు మంచితనం గమనించాక ఇట్టే మాయమయ్యాయి. వున్నతమైన వ్యక్తి. అల్లుడంటే ఇన్‌కంటాక్స్ ఆఫీసరులాంటివాడని అందరూ అంటారు. కాని ఏమీ ఆశించే మనిషి కాదు. అత్తగారిల్లంటే అదేదో బాకీ వున్న కొంపలా ప్రవర్తించే వాళ్ళు నాకు తెలుసు. కాని మా అల్లుడు అందుకు పూర్తిగా విరుద్ధం.

కాని ప్రత్యేకించి ఇవాళ అల్లుడుగారి మంచితనం గురించి కాంతం ఎందుకు చెప్తుందో అర్థం కాలేదు.

"పండుగ వొస్తుందంటే దోపిడీ దొంగల్లా దోచుకుపోయే అల్లుళ్ళేగాని మన అల్లుడిలాంటి వారు ఎక్కడ వుంటారు." అంది.

"నిజమే. సుమతే కాదు మనం కూడ అదృష్టవంతులం" అన్నాను.

"అమ్మాయికి జత బంగారు గాజులు చేయించాడు పండక్కి"

"ఆఁ" అని నోరు తెరిచాను.

"నిజమండి. ఎంత ముచ్చటగా వున్నాయో" అంది మురిపెంగా.

రాత్రి భోజనాలప్పుడు సుమతి చేతుల వొంక పరిశీలనగా చూశాను. రెండు బంగారు గాజులు. పచ్చగా తళ తళలాడే ఆ గాజులు సుమతి చేతికి మరింత అందాన్నిచ్చాయి.

"నిజమేనేవ్. గాజులు చాల బావున్నాయి" పడక గదిలో కాంతంతో అన్నాను.

"మరి అల్లుడుగారంటే ఏమనుకున్నారు.?" అంది ఇష్టంగా.

తటాలున వారం రోజుల క్రితం జరిగిన రాద్ధాంతం గుర్తొచ్చింది నాకు. కోడలికి చిన్న వుంగరం చేయించినందుకు కొడుకుని తిట్టిపోసిన కాంతం, ఇవాళ కూతురికి జత బంగారు గాజులు చేయించిన అల్లుణ్ణి నెత్తి మీద పెట్టుకుంది.

చిత్రం!!

ఇందులో ఆశ్చర్యం ఏముంది? నిజానికి కాంతం మంచిదే. కాని ప్రతి స్త్రీలో ఇద్దరు ఆడవాళ్ళు వుంటారు. ఒకరు అమ్మ అయితే రెండో వారు అత్త. వాళ్ళ తప్పు ఏమీలేదు. వాళ్ళ "నైజమే" అంత.

ఆ ఆలోచనతో చిన్నగా నవ్వుకున్నాను.

"ఏమిటి నవ్వుతున్నారు" అంది కాంతం.

"ఏమీ లేదు. సుమతి అదృష్టవంతురాలు" అన్నాను.

ఆ మాటతో కాంతం కళ్ళు మెరిశాయి– తృప్తిగా.